తెలుగు దినపత్రిక
jayabheridaily.com
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 203
పేజీలు : 5
వెల : 4
మల్కాజిగిరి
సోమవారం 04-03-2024

KISHAN COMPUTERS
SALES & SERVICE
Computers, Laptop Repair
Mother Board Repair,
Printers Repair,
Catrige Refilling,
New Catriges,
Ink Bottles, Accessories
Near MRO Office, Opp. Shamirpet Lake,
Shamirpet Mandal, Medchal Dist.
Cell: 80994 82143, 99488 05009




## నేటి నుంచి డిఎస్సీ దరఖాస్తుల స్వీకరణ

ఏప్రిల్ 3వ తేదీ వరకు గడువు

తెలంగాణ మెగా డిఎస్సీ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. నేటి నుంచి ఆన్లైన్లో దరఖాస్తుల స్వీకరణకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. తెలంగాణ మెగా డిఎస్సీ 2024 దరఖాస్తుల స్వీకరణ మార్చి 4వ తేదీ నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు ఆన్లైన్ పోర్టల్ అభ్యర్థులకు అందుబాటులో ఉండనుంది. గత గురువారం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ను సిఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు.

## కీలక నేతలు అసంతృప్తి!

### తెలంగాణ బీజేపీలో తొలి జాబితా చిచ్చు



✍ జయభేరి, హైదరాబాద్ :

**బీజేపీ తొలి జాబితాపై తెలంగాణ కాషాయ నేతలు గుర్రుగా ఉన్నారు. టికెట్ తమకే ఖరారు అని భావించిన నేతలకు తొలి జాబితాలో నిరాశ ఎదురైంది. దీంతో కొందరు నేతలు రెండో జాబితా కోసం ఎదురుచూస్తుంటే... మరికొంత మంది భవిష్యత్తుపై ఆలోచనలో పడ్డారు.**

రానున్న లోక్ సభ ఎన్నికలకు బీజేపీ తొలి జాబితా విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ జాబితాలో తెలంగాణ నుంచి 9 మందికి సీట్లు కేటాయించారు. అయితే తొలిజాబితాపై తెలంగాణలో అసమ్మతి రాజుకుంటుంది. తొమ్మిది మంది జాబితాలో ముగ్గురు సిట్టింగ్ ఎంపీలకు అవకాశం దక్కగా... నలుగురు కొత్తవారికి అధిష్ఠానం చోటు కల్పించింది. నాగర్ కర్నూలు, మల్కాజ్ గిరి, జహీరాబాద్, హైదరాబాద్ స్థానాల్లో పార్టీ కీలక నేతల నుంచి అసంతృప్తి వ్యక్తం అవుతుంది. హైదరాబాద్ పార్లమెంట్ స్థానం ఆశించిన

..మిగతాది 2 లో



## మళ్లీ పాత పేరు..!

### 'యాదాద్రి' పేరు యాదగిరిగుట్టగా మారబోతుందా..?

యాదాద్రి పేరు యాదగిరిగుట్టగా మారబోతుందా..? కొత్తగా అధికారంలోకి వచ్చిన తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం... ఆ దిశగా ఆలోచన చేస్తుందనే చర్చ గట్టిగా వినిపిస్తోంది. త్వరలోనే పేరు మార్పునకు సంబంధించిన ఉత్తర్వులు కూడా వస్తాయని తెలుస్తోంది. ఇదే విషయాన్ని స్థానిక ఎమ్మెల్యేనే కాదు... జిల్లాకు చెందిన కీలక మంత్రి కూడా స్పష్టం చేశారు. దీంతో... యాదాద్రి పేరు మారటం ఖాయమే అన్న చర్చ జోరందుకుంది.

..మిగతాది 2 లో


## బీఆర్ఎస్ కు షాక్ ఇస్తారా..?

### సీఎం రేవంత్ తో భద్రాచలం ఎమ్మెల్యే భేటీ..!

✍ జయభేరి, హైదరాబాద్ :

సీఎం రేవంత్ రెడ్డితో బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు భేటీ అయ్యారు. హైదరాబాద్ లోని సీఎం రేవంత్ నివాసంలో... కుటుంబ సమేతంగా కలిశారు. మంత్రి పొంగులేటితో కలిసి వెంకట్రావు సీఎం రేవంత్ దగ్గరకు వెళ్లారు. ఈ భేటీతో ఆయన పార్టీ మారుతారనే చర్చ జోరందుకుంది. అయితే ఇది మర్యాదపూర్వక భేటీనే అని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అంటున్నారు. ఏకైక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు... 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం జిల్లా నుంచి బీఆర్ఎస్ తరపున గెలిచిన ఏకైక ఎమ్మెల్యే. జిల్లాలో 9 అసెంబ్లీ స్థానాలు ఉండగా ఎనిమిది స్థానాల్లో కాంగ్రెస్ గెలిచింది. భద్రాచలంలో మాత్రం బీఆర్ఎస్ పార్టీ గెలిచింది.

..మిగతాది 2 లో






## ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా జరుగుతాయి

✍ జయభేరి, న్యూఢిల్లీ, మార్చి 3:

త్వరలోనే లోక్సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. ఈలోగా అన్ని రాష్ట్రాల్లో ఎన్నికల ఏర్పాట్లపై కేంద్ర ఎన్నికల సంఘం సమీక్ష నిర్వహిస్తోంది. అన్ని రాష్ట్రాల్లోనూ పర్యటించి స్థానిక ఎన్నికల అధికారులతో సమావేశమవుతోంది. ఈ క్రమంలోనే యూపీలో పర్యటించింది. ఆ తరవాత ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ కీలక విషయాలు వెల్లడించారు. ఎన్నికలు ఎలా నిర్వహించనున్నారో మీడియాకి వివరించారు. ఎన్నికల ప్రక్రియని పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు స్పష్టం చేశారు. ఏ పార్టీపైనా పక్షపాతం చూపించే అవకాశముండదని తేల్చి చెప్పారు. ప్రధాన పార్టీలన్నీ ఇప్పటికే తమతో మాట్లాడాయని, ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలని డిమాండ్ చేశాయని తెలిపారు. ఎన్నికల్లో ధన బలాన్ని వినియోగించడం మానుకోవాలని సూచించారు."లోక్సభ ఎన్నికల్ని పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా ఏర్పాట్లు చేస్తున్నాం. నిబంధనలు అన్ని పార్టీలకూ ఒకే విధంగా అమలవుతాయి. ఏ పార్టీపైనా పక్షపాతం చూపించం. ఆప్, బీజేపీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీలతో పాటు కొన్ని ప్రాంతీయ పార్టీలూ మాతో సంప్రదింపులు జరుపుతున్నాయి. ఎన్నికల్లో ఎక్కడా అవకతవకలు జరగకుండా సమర్థంగా నిర్వహించాలని డిమాండ్ చేశాయి. పోలీసులు ఏకపక్షంగా పని చేయడం మానుకోవాలని చెప్పాయి. అంతేకాదు. ఎన్నికల్లో కొన్ని పార్టీలు ధనబలాన్ని వినియోగిస్తున్నాయని, దీనిపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశాయి" రాజీవ్ కుమార్, ప్రధాన ఎన్నికల అధికారి.

ఇదే సమయంలో యూపీలోని ఎన్నికల స్థితిగతులపైనా మాట్లాడారు రాజీవ్ కుమార్. తొలిసారి ఓటు వేసే మహిళల సంఖ్య ఈసారి ఎక్కువగా ఉందని, వాళ్లందరి కోసం అన్ని పోలింగ్ బూత్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకునే బాధ్యత తమపై ఉందని స్పష్టం చేశారు. 85 ఏళ్లు పైబడిన ఓటర్లు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా వెసులుబాటు కల్పిస్తామని తెలిపారు. "ఈ సారి తొలిసారి ఓటు వేసే మహిళల సంఖ్య 7 లక్షల 26 వేల వరకూ ఉంది. పోలింగ్ బూత్లలో వీళ్లందరికీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాం. వాళ్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకుంటాం. కొన్ని పోలింగ్ బూత్లను పూర్తిగా మహిళలే నిర్వహిస్తారు. 85 ఏళ్లు పైబడిన వాళ్లు ఇంట్లో నుంచే ఓటు వేసేలా వెసులుబాటు తీసుకొస్తాం. ఈ ఎన్నికల ప్రక్రియలో అర్హులందరూ భాగస్వాములు కావాలి"



## పాకిస్థాన్ ప్రధానిగా షెహ్బాజ్ షరీఫ్ ప్రమాణం

పాకిస్థాన్లో రాజకీయ ప్రతిష్ఠంభణకు తెరపడింది. ఆ దేశ ప్రధానిగా షెహ్బాజ్ షరీఫ్ రెండోసారి ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్లో.. అరుపులు, గందరగోళం, నిరసనల మధ్య జరిగిన ఓటింగ్ ప్రక్రియలో 201 ఓట్లతో షెహ్బాజ్ ఎన్నికయ్యారని స్పీకర్ ఆదివారం ప్రకటించారు. బిలావల్ భుట్టో జర్దారీకి చెందిన పాకిస్థాన్ పీపుల్స్ పార్టీతో కలిసి పాకిస్థాన్ ముస్లిం లీగ్నవాజ్కు చెందిన షెహ్బాజ్ సంకీర్ణ ప్రభుత్వానికి నేతృత్వం వహించనున్నారు. మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్కు చెందిన పాకిస్థాన్ తెహ్రీక్ఇఇన్సాఫ్ మద్దతు గల ఇండిపెండెంట్లు అత్యధిక సంఖ్యలో విజేతలుగా నిలవగా, పీఎంఎల్ఎన్, పీపీపీ

..మిగతాది 2 లో

## విలీనం దిశగా అడుగులు..!

### తెరపైకి 'హైదరాబాద్ గ్రేటర్ సిటీ కార్పొరేషన్'




✍ జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టిన రోజు నుంచే సంచలన నిర్ణయాలు తీసుకుంటున్న రేవంత్ సర్కార్ తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రో డెవలప్మెంట్ అథారిటీ (HMDA) పరిధిలో ఉన్న అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు అలాగే మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్ లో విలీనం చేయాలని తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తుంది. హెచ్ఎండిఏ పరిధిలోని ప్రాంతాలన్నీ కలిపి ఒకే కార్పొరేషన్ ఏర్పాటు చేయడం లేదా నాలుగు వైపులా నాలుగు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని తెలంగాణ సర్కార్ ఆలోచిస్తుంది. ప్రస్తుతం హెచ్ఎండిఏ పరిధిలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు అలాగే 30 మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటన్నిటిని కలిపి హైదరాబాద్ గ్రేటర్ సిటీ కార్పొరేషన్గా ఏర్పాటు చేయాలని

..మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## నేటి నుంచి డిఎస్సీ దరఖాస్తుల స్వీకరణ

తెలంగాణలో మొత్తం 11,062 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 2023 సెప్టెంబర్లో 5,089 పోస్టులతో జారీ చేసిన నోటిఫికేషన్ను రద్దు చేసి మెగా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారు. తాజా నోటిఫికేషన్ సోమవారం నుంచి అందుబాటులో వచ్చింది. అభ్యర్థులు https://tsdsc.aptonline.in/tsdsc/ దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. తొలుత పోస్టును ఎంచుకుని, నిర్దేశిత ఫీజు చెల్లించి Online Applications దరఖాస్తును పూరించాల్సి ఉంటుంది.
తాజాగా భర్తీ చేయనున్న మొత్తం 11,062 ఉద్యోగాల్లో.... 2,629 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. భాషా పండితులు 727, పీఈటీలు 182, ఎస్జీటీలు 6,508, ప్రత్యేక కేటగిరీలో స్కూల్ అసిస్టెంట్లు 220, ఎస్జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్) 796 ఉద్యోగాలు ఉన్నాయి. గతంలో డిఎస్సీ దరఖాస్తు చేసుకున్నవారిని తాజా నియామకాలకు కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని విద్యాశాఖ అధికారులు స్పష్టత ఇచ్చారు. తాజా ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా, పోస్టుల రిక్రూట్మెంట్ కోసం కొత్తగా మార్చి 4వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. కొత్తగా విడుదలైన డీఎస్సీ నోటిఫికేషన్ లోని ఖాళీల్లో హైదరాబాద్ జిల్లాలో ఎస్జీటీ పోస్టులు 537 అత్యధికంగా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లాలో కేవలం 21 మాత్రమే ఉండగా....స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలు అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 176 ఉన్నాయి. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో 26 పోస్టులు మాత్రమే ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో 74 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉండగా ఎస్జీటీలు 209గా ఉన్నాయి. నల్గొండ జిల్లాలో 383 ఎస్జీటీ ఖాళీలు ఉన్నాయి. హన్మకొండ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 158 ఉండగా... ఎస్జీటీ ఉద్యోగాలు 81 ఉన్నాయి. ఇక జగిత్యాల జిల్లాలో చూస్తే...స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 99 ఉన్నాయి. ఎస్జీటీ ఉద్యోగాలు 161గా ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో 86 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉండగా...224 ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. యాదాద్రి జిల్లాలో 84 స్కూల్ అసిస్టెంట్ లు ఖాళీగా ఉంటే... 137 పోస్టులు ఎస్జీటీలు ఉన్నాయి.

**దరఖాస్తు చేయడం ఇలా....**

అప్లికేషన్ ప్రాసెసింగ్ మరియు వ్రాత పరీక్ష కోసం చెల్లించాల్సిన రుసుము ఒక్కో పోస్టుకు రూ.1000/ చెల్లించాలి. వేర్వేరు పోస్టకు హాజరు కావాలనుకునే అభ్యర్థులు ఒక్కో పోస్టుకు విడిగా రూ. 1000/ రుసుమును చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసే ప్రతి పోస్టుకు వేర్వేరు దరఖాస్తులను సమర్పించాలి. మార్చి 4 వ తేదీ విద్యాశాఖ వెబ్సైట్లో https://tsdsc.aptonline.in/tsdsc/ ఫీజు చెల్లింపు గేట్వే లింక్ ద్వారా క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్ /నెట్ బ్యాంకింగ్ ద్వారా ఫీజును ఆన్లైన్లో చెల్లించవచ్చు. ఏప్రిల్ 2వ తేదీతో ఫీజు చెల్లింపు గడువు ముగియనుంది. ఏప్రిల్ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆన్లైన్లో దరఖాస్తులు పూర్తి చేయడానికి దశల వారీ విధానాన్ని మార్చి 4వ తేదీ నుంచి అందుబాటులోకి తీసుకువస్తారు. గరిష్ఠ వయోపరిమితిని 46ఏళ్లుగా పేర్కొన్నారు.
డిఎస్సీ 2024 ఉద్యోగాల భర్తీని కంప్యూటర్ ఆధారిత రిక్రూట్మెంట్ టెస్ట్ (CBRT) కింది "ఆన్లైన్"లో నిర్వహిస్తారు. తెలంగాణలో 11 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. 1) మహబూబ్నగర్, 2) రంగారెడ్డి, 3) హైదరాబాద్, 4) మెదక్, 5) నిజామాబాద్, 6) ఆదిలాబాద్, 7) కరీంనగర్, 8) వరంగల్, 9) ఖమ్మం, 10) నల్గొండ 11) సంగారెడ్డి జిల్లాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు.

## బీఆర్ఎస్ కు షాక్ ఇస్తారా..?

నిజానికి తెల్లం వెంకట్రావు... మంత్రి పొంగులేటి అనుచరుడిగా ఉన్నారు. ఎన్నికల కంటే ముందే పొంగులేటితో పాటు కాంగ్రెస్ లో వెళ్లినప్పటికీ... తిరిగి బీఆర్ఎస్ లో చేరారు. బీఆర్ఎస్ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి వెంకట్రావు...కాంగ్రెస్ లోకి వెళ్తారనే చర్చ చాలా రోజులుగా వినిపిస్తోంది. ఫలితాలు వచ్చిన కొద్దిరోజులకే పాత ఫొటోలు కూడా వైరల్ అయ్యాయి. అయితే వీటిని ఖండించారు వెంకట్రావు. అయితే తాజాగా కుటుంబసమేతంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. అయితే ఇందులో మంత్రి పొంగులేటి ఉండటంతో... పార్టీ మార్పుపై ఊహాగానాలు మరోసారి మొదలయ్యాయి. అయితే వీటిని కూడా వెంకట్రావు కొట్టిపారేస్తున్నట్లు తెలిసింది. కేవలం నియోజకవర్గ సమస్యలపై కలిశానని చెప్పినట్లు సమాచారం. కొద్దిరోజుల కిందటే ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. వారే కాకుండా గ్రేటర్ హైదరాబాద్ కు చెందిన ఎమ్మెల్యేతో పాటు మేయర్ కూడా సీఎంను కలిశారు. ఈ టైమ్ లో కూడా పార్టీ మార్పు వార్తలు గట్టిగా వినిపించాయి. అయితే ఈ వార్తలను సదరు ఎమ్మెల్యేలు తీవ్రంగా ఖండించారు. కేవలం తమ తమ నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆపరేషన్ ఆకర్ష్ కు పదునుపెట్టే ఆలోచనలో కాంగ్రెస్ ఉంది. రాష్ట్రం నుంచి మెజార్టీ సీట్లను గెలుచుకోవాలని గట్టిగా భావిస్తోంది. పలువురు ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకుని ప్రతిపక్ష బీఆర్ఎస్ కు షాక్ ఇవ్వాలని చూస్తోంది. ఇప్పటికే పలువురు సిట్టింగ్ ఎంపీలు... బీజేపీలో చేరుతున్నారు. ఈ క్రమంలో... ఎమ్మెల్యేలు కూడా ఇదే దారిలో నడుస్తారా అన్న చర్చ వినిపిస్తోంది. మరోవైపు లోక్ సభ అభ్యర్థులపై బీఆర్ఎస్ కూడా ఫోకస్ చేస్తోంది. ఏ క్షణమైనా పలు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది.

## మళ్లీ పాత పేరు..!

**యాదాద్రిగా యాదగిరిగుట్ట...**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో తొలిసారిగా బీఆర్ఎస్ సర్కార్ ఏర్పాటైంది. అధికారంలోకి వచ్చిన కేసీఆర్... యాదగిరిగుట్ట అభివృద్ధిపై ఫోకస్ పెట్టారు. ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్ రూపొందించటంతో పాటు YTDA (YADAGIRIGUTTA TEMPLE DEVELOPMENT AUTHORITY)ను కూడా ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా అధికారులను కూడా నియమించారు. 1200 కోట్ల రూపాయలతో ఈ ఆలయాన్ని పూర్తిస్థాయిలో పునర్ నిర్మించింది ప్రభుత్వం. 2015లో పునర్ నిర్మాణాన్ని మొదలుపెట్టగా...2022లో పూర్తి అయ్యాయి. ప్రధానాలయం పునర్ నిర్మాణ పనులు ఉండటంతో... 2016 ఏప్రిల్ 21 నుంచి బాలాలయంలో భక్తుల దర్శనాలు అనుమతిచ్చారు. చాలారోజుల పాటు ఇక్కడే దర్శనాలను ఏర్పాటు చేయగా... 2022 నుంచి ప్రధాన ఆలయంలోకి అనుమతి ఇస్తున్నారు. పునర్ నిర్మాణంలో భాగంగా... యాదగిరిగుట్టగా ఉన్న పేరును యాదాద్రిగా మార్చారు. అప్పట్నుంచి ఆ ఆలయ పేరు యాదాద్రిగా అమల్లోకి వచ్చింది. ఇదే పేరుతో జిల్లాను కూడా ఏర్పాటు చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వం.
యాదాద్రి పేరును తిరిగి యాదగిరిగుట్టగా మార్చే ఆలోచనలో సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే(ఆలేరు) బీర్ల ఐలయ్య చెప్పారు. త్వరలోనే యాదాద్రి పేరును యాదగిరిగుట్టగా మారుతుందని... ఇదే విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోబోతున్నారని చెప్పారు. గతంలో ఉన్న విధానాలను అమల్లోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. ఈ క్షేత్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు సీఎం నిర్ణయించారని తెలిపారు. క్షేత్రానికి పూర్వ సంప్రదాయం చేకూర్చేలా ప్రయత్నిస్తామని వివరించారు. కొండ పై డార్మిటరీ హాల్ నిర్మించి భక్తులు నిద్ర చేసే అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. ఇదిలా ఉంటే జిల్లాకు చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా ఇదే విషయాన్ని చెప్పారు. యాదాద్రి పేరును యాదగిరిగుట్టగా మారుస్తామన్నారు.
స్థానిక ఎమ్మెల్యేతో పాటు జిల్లా మంత్రి కోమటిరెడ్డి కూడా యాదాద్రి పేరు మార్పుపై కీలక ప్రకటన చేసిన నేపథ్యంలో.... త్వరలోనే ప్రకటన వెలువడే అవకాశం ఉందన్న చర్చ వినిపిస్తోంది.
మరోవైపు కొద్దిరోజులుగా యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి కొండపైకి ఆటోలను అనుమతిస్తున్నారు. దాదాపు రెండేళ్ల తర్వాత ఆటోలను అనుమతించారు. ఆలయన పునర్ నిర్మాణం తర్వాత... కొండపైకి ఆటోలు వెళ్లకుండా నిషేధించారు. అయితే తాము అధికారంలోకి వస్తే ఆటోలు కొండపైకి వెళ్లేలా చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ హామీనిచ్చింది. ఇందులో భాగంగా... ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి కొండపైకి ఆటోలను అనుమతిస్తున్నారు. రోజుకు 100 ఆటోలు షిఫ్టుల వారీగా కొండపైకి నడుస్తున్నాయి. ఉదయం 3 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మొదటి షిఫ్ట్, మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 11 గంటల వరకు రెండో షిఫ్ట్ ఉంటుంది. షిఫ్టుకు 50 ఆటోలు చొప్పున రాకపోకలు కొనసాగిస్తున్నాయి. 25 ఆటోలు కొండపైన ఉంటే, మరో 25 కొండ కింద ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆటోలో డ్రైవర్తో పాటు ముగ్గురు ప్రయాణికులకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్, ఇతర పత్రాలు తప్పనిసరిగా ఉండాల్సిందే.

# నీళ్లే అజెండాగా గులాబీ ప్లాన్

**2018లో ముందస్తు ఎన్నికలకు వెళ్లడం వల్ల ఎలాంటి ప్లస్ పాయింట్లు ఉంటాయని కేసీఆర్ అంచనా వేసుకున్నారో ఇప్పుడు.. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన మూడు నెలల్లో మళ్లీ పార్లమెంట్ ఎన్నికలు ఎదుర్కోవాల్సి రావడం అంతగా మైనస్ అవుతోంది. ఓ వైపు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి.. మరో వైపు పోటీకి సిద్ధంగా లేని పార్టీ నేతలు, బలమైన అభ్యర్థుల్ని ఎంపిక చేసుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవడం .. మరితం టెన్షన్కు గురి చేస్తున్నాయి.**




**✍ జయభేరి, హైదరాబాద్, మార్చి 3:**

లోక్సభ ఎన్నికలు ముంచుకొస్తున్న సమయంలో తెలంగాణలో రెండు జాతీయ పార్టీల కన్నా ఎక్కువగా ఒత్తిడికి గురవుతోంది భారత రాష్ట్రసమితి. 2018లో ముందస్తు ఎన్నికలకు వెళ్లడం వల్ల ఎలాంటి ప్లస్ పాయింట్లు ఉంటాయని కేసీఆర్ అంచనా వేసుకున్నారో ఇప్పుడు.. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన మూడు నెలల్లో మళ్లీ పార్లమెంట్ ఎన్నికలు ఎదుర్కోవాల్సి రావడం అంతగా మైనస్ అవుతోంది. ఓ వైపు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి.. మరో వైపు పోటీకి సిద్ధంగా లేని పార్టీ నేతలు, బలమైన అభ్యర్థుల్ని ఎంపిక చేసుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోవడం .. మరితం టెన్షన్కు గురి చేస్తున్నాయి.
ఈ సమయంలో బలంగా ప్రజల్లోకి వెళ్లడానికి ఓ అజెండా కూడా కరవైంది. కానీ ..తెలంగాణ ఉద్యమంలో కీలకమైన నీళ్ల అజెండాతోనే వెళ్లాలని డిసైడయ్యారు. కాళేశ్వరం విషయంలో తాము చేసిన కృషిని తక్కువ చేస్తున్న ప్రభుత్వ వైఖరిని తప్పు పడుతూ ప్రజల్లోకి వెళ్లాలని డిసైడయ్యారు.
తెలంగాణ ఉద్యమం నాటి నినాదమే నేటి ఓట్లనాదమైంది. ఉద్యమ కాలం నాటి నీళ్లు, నిధులు, నియామకాలు నినాదం మార్మోగుతూనే ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై దశాబ్దం కావొస్తున్నా ఉద్యమ కాలం నాటి నీళ్లు, నిధులు, నియామకాలు నినాదం మార్మోగుతూనే ఉంది. ప్రస్తుతం తెలంగాణలో అధికార, ప్రతిపక్ష నేతల మధ్య వాటర్ వార్ ఓ రేంజ్ కి వెళ్లింది. కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలపై కాంగ్రెస్ బీఆర్ఎస్ను టార్గెట్గా చేసుకొని విమర్శలు చేస్తోంది. ఇప్పుడు అదే ప్రాజెక్టును ఆయుధంగా చేసుకొని హస్తం పార్టీపై కౌంటర్ అటాక్ ప్రారంభించింది గులాబీ పార్టీ.
ఇందులో భాగంగా మార్చి 1 నుంచి చలో మేడిగడ్డ కార్యక్రమానికి పిలుపునిచ్చిన బీఆర్ఎస్.. కాళేశ్వరం సమగ్ర స్వరూపాన్ని ప్రజలకు తెలియజెప్పే ప్రయత్నాలు ప్రారంభించింది. ఇదే సమయంలో నీటి పోరు యాత్రలో భాగంగా కరీంనగర్లో భారీ బహిరంగ సభకు కూడా ప్లాన్ చేసినట్లుగా తెలుస్తోంది. పార్లమెంటుకు ఎన్నికలు జరగబోతున్న తరుణంలో బీఆర్ఎస్ పార్టీ ప్రాజెక్టుల సందర్శన పేరిట ప్రజాక్షేత్రంలోకి దిగనుంది.
బహుశా ఎన్నికలయ్యేంత వరకు ఈ కార్యాచరణ కొనసాగుతుందని అంచనా. కృష్ణా జలాల వినియోగంపై కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగడుతూ ఇటీవల నల్లగొండలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ నిర్వహించింది. కేంద్ర ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గిన కాంగ్రెస్.. కృష్ణా జలాలపై హక్కులను కోల్పోయేలా చేసిందని ఆరోపించింది. ఈ విషయంలో కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ నీటి పోరు యాత్రలకు పిలుపునిచ్చింది బీఆర్ఎస్. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసింది. అయితే.. ఈ ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ ఎన్నికలకు ముందు కుంగిపోయిన విషయం వెలుగు చూసింది. అప్పటినుంచి రాష్ట్ర రాజకీయాల్లో ఈ వ్యవహారం హాట్ టాపిక్గా మారింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ... బీఆర్ఎస్ వైఖరిని ఎండగట్టేందుకు అసెంబ్లీలో సాగునీటి ప్రాజెక్టులపై శ్వేత పత్రం విడుదల చేసింది.
'కాళేశ్వరం ఓ విఫల ప్రాజెక్టు. బీఆర్ఎస్ ప్రభుత్వం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. కాళేశ్వరం బీఆర్ఎస్ అవినీతికి పెద్ద ప్రాజెక్ట్. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజెప్పాలి' అన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మేడిగడ్డ ప్రాజెక్టును సందర్శించిన సీఎం రేవంత్రెడ్డి.. బ్యారేజీలోని లోపాలను ఎత్తిచూపారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే మేడిగడ్డ మాత్రమే కాదని, ప్రాజెక్టులో ఇది ఒక బ్యారేజీ మాత్రమేనని చెబుతోంది బీఆర్ఎస్. ఈ క్రమంలోనే మార్చి ఒకటో తేదీ నుంచి చలో మేడిగడ్డ కార్యక్రమానికి పిలుపునిచ్చింది బీఆర్ఎస్. 150 నుంచి 200 మంది బీఆర్ఎస్ ప్రతినిధులతో మేడిగడ్డను సందర్శించి... వాస్తవాలను ప్రజలకు వివరిస్తామని ప్రకటించారు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. అంతేకాదు.. తమ వెంట సీఎం రేవంత్రెడ్డితో పాటు మంత్రులు, కాంగ్రెస్ నేతలు ఎవరైనా రావొచ్చని పిలుపునిచ్చారు. కానీ కేసీఆర్ ను తీసుకెళ్లాలని కాంగ్రెస్ కౌంటర్ ఇచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందన్న విమర్శలు చేస్తున్న ప్రభుత్వం.. ఎలాంటి విచారణ అయినా జరుపుకోవచ్చని ప్రకటించింది బీఆర్ఎస్.
మేడిగడ్డలో కొంత భాగం దెబ్బతిన్నప్పటికీ నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందంటున్న గులాబీ పార్టీ.. ప్రభుత్వం దానిపై దృష్టి పెట్టాలని హితవు పలుకుతోంది. గోదావరి జలాల వినియోగంపై చేపట్టనున్న నీటి పోరు యాత్రలో భాగంగా.. మార్చి 10న కరీంనగర్లో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ సభ ద్వారా పార్లమెంట్ ఎన్నికల ప్రచార శంఖారావాన్ని పూరించనున్నారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి ప్రజల్లోకి తీసుకెళ్లేలా దశలవారీ కార్యక్రమాలకు పిలుపిచ్చింది. మేడిగడ్డ తర్వాత మిగతా బ్యారేజీలు, రిజర్వాయర్లను కూడా సందర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎలా చూసినా బీఆర్ఎస్ ఈ సారి నీళ్లతో ఓట్ల పంట పండించాలని అనుకుంటుంది. కానీ ఆ సెంటిమెంట్ రేపడం.. అంత తేలికైన విషయం కాదు. ఎందుకంటే ఇప్పుడు తెలంగాణ స్వయం పాలనలో ఉంది.

## విలీనం దిశగా అడుగులు..!

ప్రభుత్వం ఆలోచన. ఇలా సాధ్యం కానీ పరిస్థితిలో నాలుగు వైపులా ఈస్ట్, వెస్ట్ ,నార్త్ ,సౌత్ పేరిట నాలుగు కార్పొరేషన్లు ఏర్పాటు చేసే ప్రతిపాదనల పైన తెలంగాణ ప్రభుత్వం ఆలోచనలు చేస్తుంది.
మరోవైపు కొత్తగా ఏర్పాటు చేసే కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లను జనాభా ప్రతిపదికన ఏర్పాటు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు సమాచారం. అన్ని డివిజన్లో సమానంగా జనాభా ఉండేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నియోజకవర్గం సరిహద్దులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటుగా కొత్తగా ఏర్పడిన కార్పొరేషన్ లకు అసమానత నిధులు అందుతున్నాయని విమర్శలు ఉన్నాయి. కొన్ని డివిజన్లో లక్ష మంది జనాభా ఉండగా మరికొన్ని చోట్ల కేవలం 30 వేల మంది వరకే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో మౌలిక వసతుల కల్పన కోసం కేటాయించి నిధులు అధిక జనాభా ఉన్న చోట, తక్కువ జనాభా ఉన్న చోట ఒకే తిరుగా కేటాయిస్తే కొన్ని ప్రాంతాలకు లాభం జరిగి కొన్ని ప్రాంతాలు నష్టపోతున్నాయని ప్రభుత్వం భావిస్తుందు. అందుకే సమానంగా జనాభా ఉండేలా డివిజన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తుంది. దీనివల్ల గ్రేటర్ హైదరాబాద్ సిటీని ఒకే తీరుగా అభివృద్ధి చేసేందుకు ఈ విలీనం ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తుంది. ఇకపోతే ఇప్పుడున్న కార్పొరేషన్ లో మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీ కాలం పూర్తయిన వెంటనే వాటికి ప్రత్యేక అధికారులు నియమించాలని రేవంత్ సర్కార్ ఆదేశించినట్టు తెలుస్తుంది. ఆ తర్వాతే విలీన ప్రక్రియపై ముందుకు వెళ్లాలని మున్సిపల్ అధికారులకు రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఇలా అయితే న్యాయపరమైన ఇబ్బందులు ఉండవు అని ప్రభుత్వం భావిస్తుంది. ఇదే సమయంలో ఢిల్లీ తరహా విధానాన్ని అవలంబించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తుంది. ఢిల్లీలో గతంలో మూడు మున్సిపల్ కార్పొరేషన్ ఉండగా....రెండేళ్ల క్రితం వాటిని ఒకే కార్పొరేషన్ గా విలీనం చేశారు. ఆ విధానాన్ని ఇక్కడ కూడా అనుసరించేందుకు ప్రభుత్వం అధికారులతో సమాలోచనలు చేస్తుంది. ఈ నేపథ్యంలో అక్కడి విలీనం జరిగిన తీరు అందుకు అనుసరించిన విధానాలను మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి రివ్యూ మీటింగ్ లో రేవంత్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు.

## కీలక నేతలు అసంతృప్తి!

బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీ పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిపై పరోక్షంగా ఫైర్ అయ్యారు. హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయించడానికి మీకు మొగోడే దొరకలేదా అంటూ ఎద్దేవా వేశారు. ఇప్పటికీ బీజేపీలో చేరని మాధవి లతకు హైదరాబాద్ సీటు కేటాయించడంపై ఆయన ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. ఎమ్మెల్యే రాజా సింగ్ బీజేపీ ఫ్లోర్ లీడర్ అవకాశం కూడా దక్కకపోవడంతో... విజయ సంకల్ప యాత్రతో పాటు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నట్లు టాక్ వినిపిస్తుంది. మరోవైపు మల్కాజ్ గిరి ఎంపీ టికెట్ ఆశించిన పార్టీ సీనియర్ నేత మురళీధర్ రావు సైతం తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లే తెలుస్తుంది. త్వరలో ఆయన తన అనుచరులతో సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటానంటూ సంచలన ట్విట్ చేశారు.అయితే గత కొన్నాళ్లుగా మురళీధర్ రావు మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో అనేక కార్యక్రమాలు చేపట్టి తనకే టికెట్ దక్కుతుందని ఆశతో ఉండగా...హుజురాబాద్ మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కు బీజేపీ అధిష్టానం మల్కాజ్ గిరి టికెట్ కేటాయిస్తూ శనివారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈటల రాజేందర్ గెలుపునకు మురళీధర్ రావు సహకరిస్తారా? లేక మరో పార్టీలోకి వెళ్తారా? అనేది ప్రస్తుతం ఉత్కంఠగా మారింది. ఈయనతో పాటు ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ అధినేత ఎం.కొమురయ్య, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తుళ్ళ వీరేందర్ గౌడ్ సైతం మల్కాజ్ గిరి సీటు ఆశించారు. టికెట్ ఈటలకి దక్కడంతో భంగపడిన నేతలంతా గెలుపు కోసం కృషి చేస్తారా? లేదా అని సస్పెన్స్ గా మారింది. రెండో జాబితాలో టికెట్ రాకుంటే నా దారి నేను చూసుకుంటా సోయం బాపూరావు ఇదిలా ఉంటే మరోవైపు నాగర్ కర్నూల్ ఎంపీ టికెట్ ఆశించిన బంగారు లక్ష్మణ్ కుమార్తె బంగారు శృతి కూడా బీజేపీ నాయకత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. కాగా ఇటీవలే బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి వచ్చిన సిట్టింగ్ ఎంపీ పోతుగంటి రాములు కుమారుడు భరత్ కుమార్ కు నాగర్ కర్నూల్ టికెట్ కేటాయించడంతో బంగారు శృతి నిరాశతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి వచ్చిన బీబీ పాటిల్ కు టికెట్ ఇవ్వగా....ఆ స్థానంపై ఆశలు పెట్టుకున్న ఆలే నరేంద్ర కుమారుడు ఆలే భాస్కర్, మాజీ మంత్రి బాగారెడ్డి కుమారుడు జయపాల్ రెడ్డి తీవ్ర నిరాశతో ఉన్నారు. ఇటు మొదటి జాబితాలో తమ పేర్లు రాకపోవడంతో మహబూబ్ నగర్ టికెట్ ఆశించిన డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి సైతం ఆందోళనలో ఉన్నారట. ఇకపోతే ఆదిలాబాద్ స్థానంపై బీజేపీ అధిష్ఠానం తొలి జాబితాలో ఎవరి పేరు ప్రకటించుకోవడంతో సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు టికెట్ రాకుండా కొందరు నేతలు అడ్డుపడ్డారని, ఆదివాసీ బిడ్డ రెండోసారి గెలిస్తే ఎక్కడ కేంద్రమంత్రి అవుతాడో అని భయంతో తనకు టిక్కెట్ రాకుండా కొందరు బీజేపీ తెలంగాణ నేతలు అడ్డుకున్నారని ఆరోపించారు. తాను కొమ్మపై ఆధారపడ్డొడిని కాదని స్వతహాగా ఎదిగిన వ్యక్తిని అని అన్నారు. రెండో జాబితాలో టిక్కెట్ వస్తుందని తాను భావిస్తున్నట్లు ఒకవేళ రాకపోతే తన దారి తాను చూసుకుంటా అని అన్నారు.

## పాకిస్థాన్ ప్రధానిగా షెహ్బాజ్ షరీఫ్ ప్రమాణం


తర్వాతి స్థానాల్లో నిలిచాయి.
పీఎంఎల్ఎన్ అధినేత నవాజ్ షరీఫ్ తన తమ్ముడు షెహ్బాజ్ షరీఫ్, పార్టీ విధేయుడు సర్దార్ అయాజ్ సాదిక్లను ప్రధాని, జాతీయ అసెంబ్లీ స్పీకర్ పదవులకు ఆమోదించారు.
షెహ్బాజ్.. 2023 ఆగస్టు వరకు 16 నెలల పాటు సంకీర్ణ ప్రభుత్వానికి నేతృత్వం వహించారు.
పీఎంఎల్ఎన్పీపీపీ పొత్తు ఒప్పందంలో భాగంగా నవాజ్ షరీఫ్ కుమార్తె, నవాజ్ను పంజాబ్ ప్రావిన్స్ ముఖ్యమంత్రిగా నిర్ణయించారు. నవాజ్ రాజకీయ వారసురాలు మరియం సోమవారం ప్రమాణ స్వీకారం చేసి దేశంలోని ఓ ప్రావిన్స్కు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగా రికార్డు సృష్టించారు.
పీపీపీ సీనియర్ నేత, పాకిస్థాన్ మాజీ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీకి అధ్యక్ష పదవి దక్కాలని ఒప్పందంలో పేర్కొన్నారు.
* ఇమ్రాన్ ఖాన్కు చెందిన పీటీఐతో జతకట్టిన స్వతంత్ర అభ్యర్థులు 265 జాతీయ అసెంబ్లీ స్థానాలకు గాను 93 స్థానాలను కైవసం చేసుకున్నారు.
* నవాజ్ షరీఫ్ నేతృత్వంలోని పీఎంఎల్ఎన్ జాతీయ అసెంబ్లీలో 75 స్థానాల్లో విజయం సాధించింది.
* పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) జాతీయ అసెంబ్లీలో 54 స్థానాలు గెలుచుకుంది.
* దేశ విభజన సమయంలో భారత్ నుంచి వలస వచ్చిన ఉర్దూ మాట్లాడే ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కరాచీకి చెందిన ముత్తహిదా క్వామీ మూవ్మెంట్ పాకిస్థాన్ (ఎంక్యూఎంపీ)కు 17 సీట్లు వచ్చాయి.
• అభ్యర్థి మృతి చెందడంతో ఒక స్థానానికి ఎన్నిక వాయిదా పడింది. పాకిస్థాన్ రాజ్యాంగం ప్రకారం అక్కడ 266 సీట్లు ఉన్నాయి. ఒక సీటులో ఎన్నిక జరగలేదు. ఫలితంగా.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే.. 265 సీట్లల్లో కనీసం 133 చోట్ల గెలవాలి.

# రోడ్డునే మింగేసిన భూ.. బకాసురుడు

- ఎల్బీనగర్ మున్సిపల్ పరిధిలోని సాయినాథ్ కాలనీలో గవర్నమెంట్ రోడ్డునే కబ్జా చేసిన స్థానికుడు
- తన ఇష్టా రీతిగా కబ్జా చేసిన భూమిలో మొక్కలు నాటాడు
- తానే శుద్ధపూస నంటు.. నీతి వాక్యాలు వల్లిస్తాడు...

**జయభేరి, హైదరాబాద్ :**

ఎల్బీనగర్ మున్సిపాలిటీలోని వనస్థలిపురం సాయినాథ్ కాలనీ రోడ్ నెంబర్ ఏడులో ఓ స్థానికుడు గవర్నమెంట్ రోడ్డును ఆరు ఫీట్లు కబ్జా చేశాడు. కబ్జా చేసిన చోట ఎవరు బండి పార్కు చేయొద్దు అని స్వార్థ బుద్ధితో అక్కడ చెట్లు మొక్కలు పెంచుతూ తానేదో గొప్ప పని చేస్తున్నట్టు నటిస్తున్నాడు ఈ స్థానికుడు... రాజకీయ అండ ఉందో అధికారుల దయాదాక్షిన్యాలు ఉన్నాయో తెలియదు కానీ.. ఈ విషయంపై అధికారులు తెలిసినా తెలియనట్టుగా వ్యవహరిస్తున్నారా? లేకుంటే ఇంకా అధికారుల దృష్టికి రాలేదా? అని ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. సంవత్సరాలుగా ప్రభుత్వ భూములను, పంట పొలాలను కబ్జా చేయడం చూశాం! కానీ ఇలా ఓ స్థానికుడు గల్లీలో రోడ్డు (పబ్లిక్ ప్రాపర్టీ)ని కబ్జా చేయడం





విడ్డూరంగా ఉందని స్థానికులు తెలిపారు. రోడ్డుని కబ్జా చేసి ఇష్టారీతిన గోడ కట్టుకున్న, ఈ కబ్జా బాగోతాన్ని రూపుమాపేందుకు ఏ అధికారి స్పందించకపోవడం ఆశ్చర్యంగా ఉందని స్థానికులు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. అతనికి ఒక న్యాయం మాకు ఒక న్యాయం అంటూ మరింతగా రోడ్డును కబ్జా చేస్తే ఇక్కడ రోటే భవిష్యత్తులో ఉండకపోవచ్చునేమో అని అనుకుంటూ స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు.



## నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు

**జయభేరి, చింతపల్లి :**

నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించి పోలియో పై విజయం సాధించాలని నల్లగొండ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ చింతపల్లి జడ్పీటిసి కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలోని పల్లె దవాఖానాలో మరియు గొడుకొండ్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో మండల వైద్యాధికారులు నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...నిండు జీవితానికి రెండు చుక్కలు ఎంతో అవసరం అన్నారు. పుట్టిన రోజు నుండి 05 సంవత్సరాల వయస్సు గల చిన్నారి చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు చేయించి వారి బంగారు భవిష్యత్తుకు బాసటగా నిలవాలని ఆమె అన్నారు. బిడ్డ అంగవైకల్యాన్ని ఎదుర్కొనే ఏకైక మార్గం పోలియో చుక్కలు అని ఆమె అన్నారు. పిల్లలకి వచ్చే పోలియో వ్యాధికి పూర్తిగా టీకాలు వేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సిఫార్సు చేసిందన్నారు. ఈ రెండు టీకాలు ప్రపంచంలోని చాలా ప్రాంతాలలోని పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించాయని ఆమె అన్నారు. పోలియో టీకా, చిన్నారుల్లో వచ్చే పోలియో వ్యాధి నివారణకు ఉపయోగించే టీకా ఇది క్రియారహిత ఇంజెక్షన్ (ఐపివి)గా, నోటి టీకా (ఓపివి)గా రెండు రకాలుగా ఉపయోగించ బడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యం.పి.పి కొండూరు భవాణి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు బాదేపల్లి నిరంజన్, సిమర్ల శ్రీను యాదవ్, డాక్టర్లు శ్రీదేవి, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమం




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం నందు దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు NVT, సభ్యులతో కలిసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలందరికీ టీకాలు వేయడం ద్వారా భారత దేశంలో పోలియో మైలిటీస్ ని తొలగించవచ్చని, తల్లిదండ్రులు తప్పనిసరిగా ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని, నిండు జీవితానికి రెండు చుక్కలు అవసరమని సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, లీగల్ అడ్వైజర్ ఉమామహేష్, భాస్కర్ రెడ్డి, పంతులాల్ నాయక్, తాళ్ల సురేష్, కిషన్ లాల్, H శ్రీనివాస్ గౌడ్, డాన్స్ మాస్టర్ క్రాంతి, డైరెక్టర్ వాసు, రాక్ స్టార్ రమేష్, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్, కరాట మాస్టర్ శ్రీను, హోటల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, వేముల రాజు, ఖాజా ,హరి, రాకేష్, కళ్యాణ్, డాన్స్ మాస్టర్ జగన్, మెడికల్ సిబంద్ధి సునిత, వినోద, సులోచన, దినేష్, శివ, కిట్టు, అర్జున్, ఆకాశ్ క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.




## ఓసీ పేద విద్యార్థులకి న్యాయం చేయాలి

- ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అభ్యర్థులకు టెట్ లో అర్హత మార్కులు తగ్గించాలి
- రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఏనుగు సంతోష్ రెడ్డి
- రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి
- తెలంగాణ జేఏసీ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాంతో చర్చలు

**జయభేరి, కామారెడ్డి మార్చ్ 3 :**



ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ కోసం ముందుగా నిర్వహించే ఉపాధ్యాయుల అర్హత పరీక్ష (టెట్ )లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కు అర్హులైన అగ్ర వర్ణ పేదలకు కూడా బీసీ అభ్యర్థుల మాదిరిగా అర్హత మార్కులు తగ్గించాలని రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఏనుగు సంతోష్ రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు*. బుధవారం ముద్దసాని కోదండ రాంను కలిసి రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కటాఫ్ మార్కులు తగ్గించాలని కోరడం జరిగిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించే పోటీ పరీక్షల్లో అర్హత సాధించాలంటే ముందుగా ప్రతి ఒక్క బీఈడీ, టిటిసి చేసిన అభ్యర్థులు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్ )లో అర్హత సాధించాల్సి ఉంది. కావున ఈ ఉపాధ్యాయ అర్హత పరీక్షలో ఓసి అభ్యర్థులకు 90 మార్కులు, బీసీ అభ్యర్థులు 75 మార్కులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు 60 మార్కులు సాధించాలి. దీంతో 89 మార్కులు సాధించిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అర్హత కలిగిన అభ్యర్థులు ఒక్క మార్కుతో వేల సంఖ్యలో అభ్యర్థులు, ఉపాధ్యాయ పోస్టుల కొరకు నిర్వహించే పరీక్షల్లో తీవ్ర అన్యాయం జరుగుతుంది. కావున ఈడబ్ల్యూఎస్ 10% రిజర్వేషన్ కు అర్హత కలిగిన అగ్రవర్ణ పేదలకు కూడా బీసీ అభ్యర్థుల మాదిరిగా 75 మార్కులకే టెట్ అర్హత పరీక్ష మార్కులు తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఈ సమస్యపై దృష్టి సారించి పరిష్కరించి అర్హులైన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అభ్యర్థులకు తగిన న్యాయం చేయాలని కోరారు.



## గృహజ్యోతి మహాలక్ష్మి పథకం అమలు చేసినందుకు పాలభిషేకం




**జయభేరి, కామారెడ్డి మర్చి 3 :**

చేయడం ప్రభుత్వం వచ్చి మూడు నెలలు కూడా కాలే మన మాచారెడ్డి మండలానికి సిసి రోడ్లు సుమారు కోటి 70 లక్షలు కేటాయించిన ఘనత మన ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ గారిది అన్నారు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మలోత్ నౌసిలాల్ నాయక్ మాట్లాడుతూ 6 గ్యారంటీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు పథకాలు అమ్ములైదనారు ఎలక్షన్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు త్వరలోనే రెండు పథకాలు కూడా త్వరలోనే అమలు అవుతున్నారు ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ పోతుగండి శ్యాంసుందర్ రెడ్డి మండల యూత్ అధ్యక్షులు చెల్లాపురం రాజిరెడ్డి ఎస్టీ సెల్ అధ్యక్షులు శంకర్ నాయక్ ఎస్సీ సెల్ అధ్యక్షులు రామచంద్రం శ్రీనివాస్ రెడ్డి కొమరయ్య అలీ గ్రామ అధ్యక్షులు బాన్సి నాయక్ ఘన్పూర్ అధ్యక్షులు సతీష్ కొత్తపల్లి అధ్యక్షులు రాజేందర్ బంజపల్లి గ్రామ అధ్యక్షులు సంజీవ్ కుమార్ కాకలగుట్ట అధ్యక్షులు తిరుపతి సోమారంపేట అధ్యక్షులు మొజ్జ్యా అధ్యక్షులు నర్రగౌడ్ సర్ధపూర్ అధ్యక్షులు తిరుపతి అక్కాపూర్ అధ్యక్షులు లింగం రత్నగిరి పల్లి అధ్యక్షులు గంగ నరసింహులు భాస్కర్ రాజ్ కానిపెట్ అధ్యక్షులు సుక పాక చంద్రం మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీజ్ స్వామి రాజు నాయక్ సుబ్బు రంజాన్ పులరాజు భాస్కర్ ఫిరోజ్ ఖాన్ దాబ్బ రాజు మహేష్ సంతోష్ రమేష్ సంగీత రవి రవీందర్ బాలు రవి మక్కల రవి రాజేందర్ మోహన్ లక్ష్మణ్ భూమయ్య ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



## యుపి రాష్ట్ర OBC కోఆర్డినేటర్ ను సన్మానించిన టీపీసీసీ నాయకులు

**జయభేరి, హైదరాబాద్, మార్చి 3:**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (TPCC) సీనియర్ నాయకుడు మరియు OBC వర్గాల నాయకుడు.నిర్మల్ కుమార్ యాదవ్ ప్రతిష్టాత్మకమైన ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జ్ OBC కోఆర్డినేటర్గా నియమితులయ్యారు. హైదరాబాద్లోని బేగంబజార్లోని శ్రీ యాదవ్ అహిర్ పంచాయతీ భవన్లో TPCC GEN SEC ప్రేమ్లాల్, D.శంకర్, బవానీ శంకర్ చౌదరి, గోపాల్ చౌదరి, గోపాల్ చౌదరి, మహమ్మద్ జహంగీర్, శంసింగ్, దుర్వేష్ అహిర్, నర్సింహ్మన్ యాదవ్, శంకర్ సింగ్, అర్జున్ యాదవ్. ఈ తరుణంలో నిర్మల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ శ్రీమతి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఏఐసీసీ చీఫ్ శ్రీ మల్లికార్జున్ ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలుపుతూ జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు.

## నిండు జీవితానికి రెండు చుక్కలు



**జయభేరి, మేడ్చల్:**

నిండు జీవితానికి రెండు చుక్కలతో పోలియో మహమ్మారి నుంచి చిన్నారులను కపడవచ్చని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం 13వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లికార్జున్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పిల్లల నుండి ఐదు సంవత్సరాల పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు తప్పకుండా వేయించాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.


## పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలి



**జయభేరి, మేడ్చల్:**

ఐదు సంవత్సరాల లోపు పిల్లలు పోలియో వ్యాధి దారిన పడకుండా ప్రతి ఒక్కరికి పోలియో చుక్కలు వేయించాలని గుండ్లపోచంపల్లి చైర్ పర్సన్ మద్దుల లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం పల్స్ పోలియో లో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్ పర్సన్ మద్దుల లక్ష్మి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలియో వ్యాధి బారినపడిన పిల్లలకు అంగవైకల్యం సంభవిస్తుందని అందువల్ల అంగవైకల్యం బారిన పడకుండా పిల్లలను రక్షించుకునేందుకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. ఐదు సంవత్సరాలలోపు చిన్నారుల తల్లిదండ్రులు వారి పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు అమరం జైపాల్ రెడ్డి, భేరి బాలరాజు, అమరం హేమంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాములు, మేనేజర్ శ్రీనివాస్ గౌడ్, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## సేవ్ దా చిల్డ్రన్




**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ పట్టణంలోని ఎస్.ఎస్.జి పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో ఈ మధ్య కాలంలో జరుగుతున్న చిన్న పిల్లల కిడ్నాప్ ల విషయంలో చిన్న పిల్లల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఒకటవ తరగతి చదువుతున్న జి.వర్ధన్ చేసిన ప్రాజెక్ట్ ప్రతి చిన్న పిల్లల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించడం పట్ల పాఠశాల ప్రిన్సిపల్ రాధాకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మిలు, ఉపాధ్యాయులు సంతోషిలతో పాటు పలువురు ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.








# వార్తలు నిజమేనా?

నిర్ణయాలు వేగవంతంగా తీసుకోవడంలో మాస్టర్ నందమూరి బాలకృష్ణ. కథ నచ్చితే దర్శకుడికి అనుభవం లేకపోయినా అవకాశాలిచ్చే స్తారాయన. దానికి చాలా ఉదాహరణలున్నాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో బాలయ్య వార్తలకున్నంత డిమాండ్ ఎవరికీ లేదు. ఆయన విజయాలే దానికి కారణం కావొచ్చు. రేటింగులకోసం ఏదో ఒక బాలయ్య వార్తని వండి వార్చేయడం నెటిజన్స్‌కి పరిపాటైపోయింది. రీసెంట్‌గా బాలయ్యకు సంబంధించిన రెండు వార్తలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. 'శ్యామ్‌సింగరాయ్' దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కథను బాలయ్య ఓకే చేశారనేది అందులో తొలి వార్త. బాలయ్యకోసం 'శ్యామ్ సింగరాయ్' తరహాలో పీరియాడిక్ నేపథ్యంతో రాహుల్ కథను తయారు చేశాడని, ఆ కథ బాలయ్యకు కూడా బాగా నచ్చడంతో ఆయన ప్రొసీడ్ అన్నారని, ప్రస్తుతం చేస్తున్న బాబీ సినిమా పూర్తవ్వగానే బాలయ్య ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొంటారనేది ఆ వార్త సారాంశం. ఇక రెండో వార్త విషయానికొస్తే.. మోహన్‌బాబు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భక్తిరసాత్మక చిత్రం 'కన్నప్ప'లో బాలయ్య కూడా భాగం కానున్నారట. ఇందులో ఇప్పటికే మోహన్‌లాల్, ప్రభాస్, శివరాజ్‌కుమార్ నటిస్తున్నారని చిత్రబృందం ప్రకటించింది. ఇప్పుడు వీరితోపాటు బాలయ్య కూడా నటించనున్నట్లు వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. కథ రీత్యా ఇందులో శివుడు మారువేషంలో వచ్చి కన్నప్పని పరీక్షిస్తాడని సమాచారం. ఆ మారువేషంలో వచ్చే శివుడిగా బాలయ్య కనిపించనున్నారని తెలుస్తున్నది. మరి ఇందులో నిజానిజాలు తెలియాల్సివుంది.



## డాన్ యూనివర్స్‌లోకి కియారా అద్వానీ..!

బాలీవుడ్ దర్శకుడు ఫర్హాన్ అక్తర్ దర్శకత్వం తాజాగా తెరకెక్కిస్తున్న చిత్రం డాన్3. ఈ మూవీలో షారుఖ్ ఖాన్ ప్లేస్‌లో రణ్‌వీర్ సింగ్ హీరోగా కనిపించబోతున్నాడు. ఈ సినిమాలో హీరోయిన్‌గా కియారా అద్వానీ కనిపించనున్నది. ఈ విషయాన్ని విషయాన్ని ఫర్హాన్ అక్తర్ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించారు. 'డాన్ యూనివర్స్‌లోకి స్వాగతం కియారా అద్వానీ' అంటూ సోషల్ మీడియాలో వీడియో షేర్ చేస్తూ డైరెక్టర్‌తో పాటు నిర్మాతలు స్వాగతం పలికారు. ఇక కియారా తొలిసారిగా రణ్‌వీర్ సింగ్‌తో బిగ్ స్క్రీన్‌పై రొమాన్స్ చేయనున్నది. ఫర్హాన్ అక్తర్ డాన్3 చిత్రాన్ని గతేడాది ప్రకటించారు. డాన్ ఫ్రాంచైజీలోని తొలి రెండు చిత్రాల్లో షారుఖ్ ఖాన్ నటించిన విషయం తెలిసిందే. డాన్3లో కొత్త రణ్‌వీర్ సింగ్ కనిపిస్తాడని ప్రకటించారు. ఇదిలా ఉండగా.. కియారా అద్వానీ ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో రాంచరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'గేమ్ ఛేంజర్' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నది. అలాగే, హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీర్ నటిస్తున్న వార్2 చిత్రంలోనూ కనిపించనున్నది.



## అబ్బాయి అంటే వీడిలా ఉండాలి!

తమ ప్రేమ, పెళ్లి గురించి సోషల్‌మీడియాతో పాటు పత్రికల్లో వచ్చే కథనాలకు ఎప్పటికప్పుడు వివరణ ఇస్తూ సందేహాలను నివృత్తి చేస్తున్నారు అగ్ర నాయకానాయికలు విజయ్ దేవరకొండరష్మిక మందన్న. ఈ జంట పెళ్లిపీటలెక్కబోతున్నారంటూ గత నెలలో జాతీయ మీడియాలో సైతం వార్తలొచ్చాయి. అయితే వాటిలో ఏమాత్రం నిజం లేదని వారిద్దరూ స్పష్టత నిచ్చారు. అయినా అభిమానులు మాత్రం సోషల్‌మీడియాలో ఏదో రకంగా నిజాన్ని రాబట్టాలని చూస్తున్నారు. వీరి బంధం గురించి పరోక్షంగా ప్రశ్నలడుగుతూ కాస్త ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తాజాగా ఓ అభిమాని ట్విట్టర్ (ఎక్స్)లో పోస్ట్‌కు రష్మిక మందన్న స్పందించిన తీరు వైరల్‌గా మారింది. 'రష్మిక మందన్న భర్తగా వచ్చే అబ్బాయికి ఉండాల్సిన లక్షణాలేమిటి' అనే హెడ్డింగ్‌తో పోస్ట్ మొదలు పెట్టిన సదరు అభిమాని .. 'ఆమె భర్త 'వీడీ'లా ఉండాలి. 'వీడీ' అంటే వెరీ డేరింగ్ అని అర్థం. ఆమెను ఎప్పుడూ రక్షిస్తూ ఉండాలి. మేము రష్మికను క్వీన్ అని పిలుస్తాం కాబట్టి పెళ్లాడబోయేవాడు కింగ్‌లా ఉండాలి' అంటూ రాసుకొచ్చాడు. ఈ పోస్ట్‌పై రష్మిక స్పందిస్తూ 'మీరు చెప్పినవన్నీ నిజమే' అంటూ లాఫింగ్ అండ్ లవ్ ఎమోజీని జోడించింది. అయితే ఈ పోస్ట్‌లో 'వీడీ' అంటే విజయ్ దేవరకొండేనని, సదరు అభిమాని పరోక్షంగా ఆయన పేరును ప్రస్తావించారని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఆ పోస్ట్‌కు రష్మిక 'అవన్నీ నిజమే' అంటూ సమాధానమివ్వడంతో ఈ జోడీ మధ్య ఏదో జరుగుతోందని అభిమానులు ఊహాగానాలు చేస్తున్నారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com